www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:18 THURSDAY ,MAY 28,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 18 గురువారం 28 మే 2026 పేజీలు :8 వెల: 4/-

## ప్రధానమంత్రి మోదీని కలిసిన సీఎం విజయ్

హంస కలం వార్త మే 27

తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసుకున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. చోళుల కాలం నాటి రాగి శాసననాలకు పోలెండ్ నుంచి భారత దేశానికి రప్పించినందుకు మోదీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక ప్రకటించిన మేకేదాటు డ్యామ్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలపై దాని ప్రభావాన్ని విజయ్ ప్రధాని దృష్టికి వెళ్లారు. - మిగతా2లో



## బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు

హంస కలం వార్త మే 27

పశ్చిమబెంగాల్‌లో సుదీర్ఘ పాలనకు తెరపడటంతో చిక్కుల్లో పడిన మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మరిన్ని చిక్కులు తప్పలే కనిపించడం లేదు. ఆ పార్టీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నట్టు బీజేపీ ఎంపీ సౌమిత్రా ఖాన్ తాజాగా బాంబు పేల్చారు. - మిగతా2లో





### అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

## కేటీఆర్‌కు పొంగులేటి సవాల్



హంస కలం వార్త మే 27

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. - మిగతా2లో

## గ్రీన్ ఛాలెంజ్‌లో కూకట్‌పల్లి డిపో..

- కూకట్‌పల్లిలో 60 గ్రీన్ బస్సుల గ్రాండ్ లాంచ్..
- హైదరాబాద్ కాలుష్యానికి చెక్ చెప్పిన ఆర్టీసీ..
- జెండా ఊపి ఈవీ బస్సులు ప్రారంభించిన పొన్నం ప్రభాకర్..
- హైదరాబాద్‌లో ఇప్పటికే 540 ఎలక్ట్రిక్ బస్సులు..
- ఆర్టీసీ కార్మికులకు త్వరలో గుర్తింపు ఎన్నికలు..
- ప్రజారవాణాలో గ్రీన్ రివల్యూషన్‌కు శ్రీకారం..



కూకట్‌పల్లి, మే 27 ( హంస కలంవార్త )

హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహిత ప్రజా రవాణా వైపు దూసుకెళ్లించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో భారీ అడుగు వేసింది. గ్రీన్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి డిపోకు చెందిన 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ బస్సులు నగర ప్రజల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, ఆర్టీసీ ఈడీలు సీహెచ్ వెంకన్న, రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. - మిగతా2లో

## బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

## కూకట్‌పల్లి డీసీపీ పర్యవేక్షణలో జరుగుతున్న విచారణ

హంస కలం వార్త మే 27

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఈరోజు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరిపి, మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టును ఆశ్రయించగా... న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. - మిగతా2లో



## రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూ భారతిలో ఎలా మారింది?

హంస కలం వార్త మే 27

శంషాబాద్‌లో రూ.1000 కోట్ల భూ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అధికార కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరుస స్కామ్ లు జరుగుతున్నాయంటూ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకు ఆయన శంషాబాద్‌లో రూ.1,000 కోట్ల భూ కుంభకోణం జరిగిందంటూ వివరాలు బహిర్గతం - మిగతా2లో



## రాజ్యసభకు సిద్దరామయ్య సీఎంగా డీకే శివకుమార్



- కర్ణాటకలో సీఎం మార్పుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత

# గ్రీన్ ఛాలెంజ్‌లో కూకట్‌పల్లి డిపో..

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్య కారణంగా భవిష్యత్తులో వాయు కాలుష్య ముప్పు పెరిగే అవకాశాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో నెలకొన్న కాలుష్య పరిస్థితులు హైదరాబాద్‌లో పునరావృతం కాకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోనే 540 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా 1050 బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయని వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి ప్రజారవాణాను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు..

**కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..**

ఆర్టీసీ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. త్వరలోనే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి, ఎన్నికైన సంఘాలతో చర్చలు జరిపి ఆర్టీసీ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కార్మికులకు వేతన సవరణ అమలు చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి రెండో మంగళవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్మికుల



సంక్షేమం, ప్రయాణికుల భద్రత రెండూ ప్రభుత్వానికి సమాన ప్రాధాన్యత కలిగిన అంశాలని అన్నారు.

**అత్యాధునిక ఛార్జింగ్ కేంద్రాలు..**

ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణలో భాగంగా ప్రధాన డిపోలు, బస్టాండ్లలో అత్యాధునిక ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శబ్ద కాలుష్యం లేకుండా, వాయు కాలుష్యం తగ్గించే విధంగా ఈ బస్సులు పనిచేస్తాయని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన సీట్లు, ఆధునిక భద్రతా ప్రమాణాలు, స్మార్ట్ సౌకర్యాలతో కూడిన ప్రయాణ అనుభవాన్ని ఈ బస్సులు అందిస్తాయని పేర్కొన్నారు. ప్రజారవాణాను ఆధునీకీకరించడమే కాకుండా సంస్థను లాభాల బాటలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.



**నూతన బస్సుల్లో ప్రయాణించిన ప్రజాప్రతినిధులు..**

కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, వై. నాగిరెడ్డి, మాధవరం కృష్ణారావు, నవీన్ కుమార్, బండి రమేష్, మను చౌదరి నూతన ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణించి వాటి సౌకర్యాలను పరిశీలించారు. బస్సుల ఆకర్షణీయమైన రూపకల్పన, ఆధునిక సదుపాయాలు కార్యక్రమానికి వచ్చిన వారిని ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, వ్యక్తిగత వాహనాల కంటే ప్రజారవాణాను ఎక్కువగా వినియోగించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రారంభించిన ఈ గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ కార్యక్రమం ప్రజారవాణా రంగంలో కొత్త మైలురాయిగా నిలవనుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజ్యసభకు సిద్దరామయ్య సీఎంగా డీకే శివకుమార్

-మొదటిపేజీ తరువాయి

కర్ణాటకలో సీఎం మార్పుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.సిద్దరామయ్య రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం కానున్నారన్న ప్రచారం జోరందుకుంది.

**హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు సీఎంపదవికి సిద్దరామయ్య రాజీనామా**

కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో,ప్రభుత్వంలో కీలక మార్పులకు కారణమవుతుంది. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయనున్నట్లుగా సమాచారం. ఆయనను రాజ్యసభకు రావాలని హైకమాండ్ సూచించిందని కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడుతారని కాంగ్రెస్ వర్గాల కథనం. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు పై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత నడుమ నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్ డీకే శివకుమార్, సిద్ధరామయ్యతో రోజంతా చర్చలు జరిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలాతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు కర్ణాటక కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023లో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీలో భాగంగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చి తీరాలని అగ్రనేతల ముందు డీకే శివకుమార్ మరోసారి తన వాదన వినిపించారు. ప్రతిగా సిద్దరామయ్య తను సీఎంపదవివదులుకోవాల్సి వస్తే ఎస్సీ వర్గానికి చెంది పరమేశ్వర్ ను సీఎం చేయాలని మెలిక పెట్టారు. అయితే అన్ని వర్గాల వాదనలపై భేటీలో సుదీర్ఘ చర్చ అనంతరం కర్ణాటక సీఎం మార్పుపైన, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైన కాంగ్రెస్ హైకమాండ్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకొని, రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సహకరించాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. అతనికి రాజ్యసభ స్థానంతో పాటు ఆ సభలో విపక్ష నేతగానూ అవకాశం ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది.అధిష్టానం నిర్ణయం నేపథ్యంలో రేపు బెంగుళూరులో కేబినెట్ మీటింగ్ తర్వాత సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నారు గురువారం తొలుత సహచర మంత్రులకు అల్పాహార విందు ఇచ్చి, అనంతరం బెంగళూరులో ని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.నూతన సీఎం డీకే శివకుమార్ సారధ్యంలోని కేబినెట్ లో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర కు ఉపముఖ్యమంత్రిగానూ అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య ను రాజ్యసభ కు ఎంపిక చేయడం ద్వారా ఆయన సేవలు దేశవ్యాప్తం గా పార్టీ కోసం ఉపయోగిం కుంటా మని రాహుల్ గాంధీ భరోసా ని చ్చినట్లుగా తెలుస్తుంది.

# రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూభారతిలో ఎలా మారింది

-మొదటిపేజీ తరువాయి

శంషాబాద్ పరిధిలోని పెద్దషాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 172 నుండి 180 లో ఉన్న 94.73 ఎకరాల ప్రభుత్వ భూమి వివాదంలో తగిన నిర్ణయం తీసుకోవాలని 30--01--2026 నాడు హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఈ భూమిని నిషేధిత జాబితాలో పెట్టాలని, అక్రమార్కుల నుండి కాపాడాలని 24--2--2026 నాడు ఆర్డీవో తహశీల్దార్ కు ఆర్డర్ జారీ చేశాడని, అదే విధంగా హైకోర్టులో కూడా అఫిడవిట్ వేశాడని హరీశ్ రావు తెలిపారు. కానీ 28--02--2026 నాడు తహశీల్దార్ ఆ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు చెందినదిగా ఆర్డర్ పాస్ చేసి, హైకోర్టుకు కూడా ప్రైవేట్ వ్యక్తుల భూమి అని తెలిపాడని వెల్లడించారు. ఒకే భూమిని ఆర్డీవో ప్రభుత్వ భూమి అంటాడు, తహశీల్దార్ ప్రైవేట్ భూమి అంటాడని, అసలు కలెక్టర్ అప్రూవల్ లేకుండా ఆర్డీవో, తహశీల్దార్ భూమి గురించి హైకోర్టులో పిటిషన్ ఎలా వేసారు? అని హరీశ్ రావు నిలదీశారు. ఈ భూస్కామ్ వెనుక రేవంత్ రెడ్డి, అతని ముఖ్య అనుచరుడైన ఓ కార్పొరేషన్ చైర్మన్ , ఒక మంత్రి ఉన్నారని ఆరోపించారు. ఈ సర్వే నెంబర్ లోని 94.73 ఎకరాలతో పాటు మరో 176 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఫైల్ సిద్ధమైనట్లు సమాచారం ఉందని, మొత్తం 270 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి దాదాపు రూ.1,000 కోట్ల కుంభకోణానికి సొసైటీ వైస్ చైర్మన్ తెరలేపారని, ఈ అంశం వివాదాస్పదం అవ్వడంతో తహశీల్దార్‌ను పిలిపించి తను ఇచ్చిన ఉత్తర్వులు గురించి ఏసీబీ విచారణ సైతం చేపట్టిందని తెలిపారు. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూభారతిలో ఎలా మారింది? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆ భూమిని భూ భారతిలో ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద బదిలీ కూడా చేశారు అని, 24--05--2026 తేదీన ప్రైవేట్ వ్యక్తుల పేరిట మొత్తం 170 ఎకరాలను భూ భారతిలో ఎక్కించారు అని తెలిపారు.చట్ట ప్రకారం ఆర్డీవో దరఖాస్తు చేసుకుని, నిర్ణీత సమయంలో ఆర్డీవో నిర్ణయం తీసుకోవాలని, కానీ ఇక్కడ ఆర్డీవో ప్రమేయం లేకుండా తహశీల్దార్ నిర్ణయం తీసుకున్నాడన్నారు. ఇదంతా బయటపడగానే గుట్టుచప్పుడు కాకుండా తహశీల్దార్ ను సస్పెండ్ చేశారన్నారు. ఈ ప్రైవేట్ వ్యక్తుల జాబితాలో మంత్రుల కుటుంబ సభ్యుల పేర్లు కూడా ఉన్నాయని హరీశ్ రావు వెల్లడించారు.

## హైదరాబాద్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. ఒక్కరోజులోనే రూ.4,117 కోట్ల విలువైన భూములకు విముక్తి

ధర్మఘంట మే 27

హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన ఐటీ కారిడార్, కోకాపేట పరిసరాల్లో ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపింది. మార్కెట్‌లో ఎకరం రూ.150 కోట్లకు పైగా పలికే ఈ ప్రాంతాల్లో బడా రియల్టర్లు పక్కా ప్రణాళికతో సాగిస్తున్న భూదందాకు అడ్డుకట్ట వేసింది. నిన్న నగరం నలువైపులా ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించి, సుమారు రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకుంది. ఆక్రమణలను తొలగించి, ఆ భూముల చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేసింది.

**కోకాపేటలో బట్టబయలైన బడా సంస్థల అక్రమాలు**

ఈ ఆపరేషన్‌లో భాగంగా కోకాపేటలో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు సాగిస్తున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తచెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోని 1.09 ఎకరాల భూమిని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించుకుంది. 'గోల్డ్‌ఫిష్ కాలనీ' పేరుతో అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు నిర్మించింది. స్థానికులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన హైడ్రా అధికారులు, అది చెరువు భూమి అని నిర్ధారించుకుని అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఇదే ప్రాంతంలోని పెద్దచెరువు పరిధిలో బహుళ అంతస్తుల భవనాల కోసం ఆక్రమించిన సుమారు 22 ఎకరాల స్థలాన్ని కూడా అధికారులు కాపాడారు. ఒక్క కోకాపేటలోనే స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

**మ్యాప్ నుంచే చెరువును మాయం చేసే కుట్ర భగ్నం**

మరోవైపు శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే తొలగించేందుకు జరిగిన భారీ కుట్రను హైడ్రా భగ్నం చేసింది. తమ్మిడికుంట చెరువు నిండినప్పుడు వచ్చే వరద నీటి కాలువను కబ్జాదారులు దారి మళ్లించి, చెరువు ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత ఆ స్థలంలో భారీ ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు కూడా విచారణలో ఉంది. హైడ్రా అధికారులు శాటిలైట్ చిత్రాలు, పాత ఎఫ్‌టీఎల్ రికార్డుల ఆధారంగా 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ రూ.600 కోట్లు. దీనికి ఆనుకుని ఉన్న రూ.500 కోట్ల విలువైన 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా అధికారులు కాపాడారు.

## అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

# కేటీఆర్‌కు పొంగులేటి సవాల్

-మొదటిపేజీ తరువాయి

మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించానా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు.

## ప్రధానమంత్రి మోదీని కలిసిన సీఎం విజయ్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందుగా రాష్ట్ర గీతం పాడేందుకు అనుమతించాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం విజయ్ నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు

-మొదటిపేజీ తరువాయి

బుధవారం నాడిక్కడ మీడియాతో సౌమిత్రా ఖాన్ మాట్లాడుతూ, టీఎంసీ ఎంపీలు ఆ పార్టీలో కొనసాగే విషయంలో సంతోషంగా లేరని, బీజేపీ నేతలతో సంప్రదింపులు సాగిస్తున్నారని చెప్పారు. '20 మంది నేతలు మాతో టచ్‌లో ఉన్నారు. పార్టీ నాయకత్వం కోరుకుంటే వాళ్లంతా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో టీఎంసీ మొత్తం ఖాళీ అవుతుంది' అని అన్నారు. అయితే బీజేపీతో సంప్రదింపులు సాగిస్తున్న టీఎంసీ ఎంపీల పేర్లను సౌమిత్రా ఖాన్ వెల్లడించలేదు. పశ్చిమబెంగాల్ నుంచి మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో టీఎంసీకి ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. బీజేపీకి 12, కాంగ్రెస్‌కు ఒక ఎంపీ ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఒక పార్లమెంటరీ పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది పార్టీ మారాలనుకుంటే వారిపై అనర్హత వేటు పడదు.

## బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

-మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందుగా నిందితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, భారీ భద్రత నడుమ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విచారణ ప్రక్రియ అంతా కూకట్‌పల్లి డీసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతోంది. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు మరిన్ని సెక్షన్లను చేర్చిన నేపథ్యంలో, ఈ మూడు రోజుల కస్టడీ విచారణ అత్యంత కీలకంగా మారనుంది.

# సంపాదకీయం

## ‘సీఎం విజయ్’ చరిత్రలో నిలిచిపోవాలంటే

తిరు సి. జోసెఫ్ విజయ్, తమిళనాడు ముఖ్యమంత్రిగా మీరు సాధించిన అసాధారణ విజయానికి హృదయపూర్వక అభినందనలు. ప్రజలు మీ నాయకత్వంపై అపారమైన నమ్మకాన్ని ఉంచారు. వారి జీవితాలను మెరుగుపరచడానికి, సమ్మిళిత అభివృద్ధితో కూడిన పరిపాలనా నమూనాను నిర్మించడానికి మీ పదవీ కాలం ఒక చారిత్రాత్మక అవకాశం. నేను రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని, తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్‌గా ఇటీవలి వరకు పనిచేశాను. ప్రజా పరిపాలనలో విస్తృతంగా పనిచేసిన అనుభవంతో రాబోయే ఐదేళ్లలో మీ ప్రభుత్వ దిశానిర్దేశాన్ని రూపొందించడంలో ఉపయోగపడే కొన్ని సూచనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను. కొత్తగా ఎన్నికైన నాయకులు తరచుగా ఐఏఎస్ అధికారులపై ఎక్కువ ఆధారపడతారు. అయితే ఎందరో నిజాయితీ, సామాజిక నిబద్ధత, ధైర్యం ఉన్న అధికారులు ఉన్నట్టే, మరెందరో నిర్ణయాలు తీసుకోవడానికి భయపడుతూ యథాతథ స్థితిని కొనసాగించేవారు, లేదా మితిమీరిన బ్యూరోక్రాటిక్ ధోరణితో వ్యవహరించేవారు కూడా ఉన్నారు. అందువల్ల పోస్టింగ్‌లు, బదిలీలను అధికారుల సమర్థతలకు అనుగుణంగా కేటాయించాలి. రెవెన్యూ, జీఎస్టీ, విద్యుత్ వంటి శాఖలకు నిబంధనలు అమలు చేయగల అధికారులు అవసరమైతే, విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం, కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖలకు మానవీయ కోణం, సంక్షేమ దృక్పథం ఉన్న అధికారులు కావాలి. మీ ప్రభుత్వం ఒకేసారి చాలా కార్యక్రమాలపై దృష్టి పెట్టడం కంటే, పరిమిత సంఖ్యలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చే అంశాలపై దృష్టి సారించాలి. కొన్ని ముఖ్యమైన సంస్కరణలను వచ్చే ఐదేళ్ళలో అమలు చేస్తే అవి తమిళనాడులో పరిపాలనా నాణ్యతను, ప్రజల జీవితాలను మార్చగలవు. 1. తమిళనాడులో పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉన్నప్పటికీ, వాటిలో ఎక్కువ పాఠశాలలు చాలా చిన్నవిగా, నాణ్యమైన విద్యను అందించడానికి తగిన వనరులు లేనివిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతి బ్లాక్‌లో 6--8 పాఠశాలలను గుర్తించి, వాటిని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడేలా తమిళనాడు పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయవచ్చు. ప్రతి పాఠశాలలో కనీసం 5 ఎకరాల స్థలం, నాణ్యమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా సౌకర్యాలు, వంటశాలలు, డైనింగ్ హాళ్లు, డిజిటల్ లెర్నింగ్ టూల్స్, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం ఉండాలి. ఈ పాఠశాలలు నర్సరీ నుండి తొమ్మిది వరకు ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యను అందించాలి. సుమారు 1,500--2,000 మంది విద్యార్థులకు సేవలందించాలి. అదేవిధంగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక డిగ్రీ కళాశాలను మంచి ప్రమాణాలతో ఆధునీకరించాలి. విశ్వవిద్యాలయాలకు మెరుగైన విద్యా స్వయంప్రతిపత్తిని కల్పించాలి, ఆధునీకరించాలి. ఫ్యాకల్టీ ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. 2. వైద్యానికి పెట్టే ఖర్చులు ఎన్నో కుటుంబాలను అప్పులపాలు చేసి పేదరికంలోకి నెట్టేస్తున్నాయి. ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అర్హులైన వైద్యులు, సిబ్బంది, ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రులతో సమానమైన ఆధునిక పరికరాలతో సూపర్--స్పెషాలిటీ ప్రమాణాలతో మార్చవచ్చు. ఈ ఆసుపత్రులలో నిపుణులైన వైద్యులకు మార్కెట్‌లో ఉన్న జీతాలను ఇవ్వాలి. సమర్థవంతంగా అమలు చేస్తే ఇది జిల్లాల్లో ఆరోగ్య సంరక్షణ సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుంది. 3. రాష్ట్రం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లలో ఒకటి నిరుద్యోగం. పెద్ద సంఖ్యలో చదువుకున్న యువతకు ఫార్మల్ డిగ్రీలు ఉన్నప్పటికీ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలు లేవు. నిరుద్యోగ యువతను వారి అర్హతలు, నైపుణ్యాలతో కేంద్రీకృత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయడానికి రాష్ట్రవ్యాప్త ‘స్కిల్ బ్యాంక్’ను ఏర్పాటు చేయవచ్చు. యజమానులు ఈ వ్యవస్థ ద్వారా నేరుగా అభ్యర్థులను రిక్రూట్ చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్, నర్సింగ్, అగ్రికల్చర్, ఫార్మా, నిర్మాణ రంగం, జనరల్ డిగ్రీ నేపథ్యాలు ఉన్న గ్రాడ్యుయేట్లు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌తో సహా ఉపాధి నైపుణ్యాలపై నాలుగు నుండి ఆరు నెలల పాటు నిర్మాణాత్మక శిక్షణ ఇప్పించాలి. 4. నాణ్యమైన విత్తనాల కొరత, నిల్వ చేసే మౌలిక సదుపాయాలు సరిపోకపోవడం, బలహీనమైన మార్కెట్ సదుపాయం, దళారీల దోపిడీ వంటి తీవ్రమైన నిర్మాణాత్మక సవాళ్లను రైతులు ఎదుర్కొంటున్నారు. కోల్డ్ స్టోరేజీలు, వేర్‌హౌస్‌లు, ఫుడ్--ప్రాసెసింగ్ పరిశ్రమలు, బలమైన అగ్రికల్చరల్ కోఆపరేటివ్‌ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వం పెద్ద ఎత్తున వ్యవసాయ సంస్కరణలను చేపట్టవచ్చు. ఒక ప్రత్యేక ధాన్య సేకరణ యంత్రాంగం రైతులకు లాభదాయకమైన ధరలను నిర్ధారించాలి. దీర్ఘకాలిక వ్యవసాయ సమస్యలను క్రమపద్ధతిలో పరిష్కరించడానికి ఒక పెద్ద ‘రైతు అభివృద్ధి నిధి’ (ఫార్మర్స్ డెవలప్‌మెంట్ ఫండ్)ను ఏర్పాటు చేయవచ్చు. 5. పోలీస్ స్టేషన్లు అవినీతి సంస్థలుగా చెడ్డపేరు తెచ్చుకున్నాయి. పోలీసు వ్యవస్థను పౌర--స్నేహపూర్వక వ్యవస్థగా మార్చాల్సిన అవసరం ఉంది. పౌరులు డిజిటల్ సేవా కేంద్రాల (మీ సేవ) ద్వారా ఫిర్యాదులను సమర్పించగలిగేలా ఉండాలి. వాటిని ఎఫ్ఐఆర్‌లా మార్పు చేసే పద్ధతి ఉండాలి. ఎఫ్ఐఆర్‌ల నమోదును పారదర్శకంగా పర్యవేక్షించాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. పోలీసింగ్‌లో రాజకీయ జోక్యాన్ని గణనీయంగా తగ్గించాలి. 6. విజిలెన్స్, అవినీతి నిరోధక సంస్థలను కఠినమైన జవాబుదారీ విధానాలతో బలోపేతం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఏటా తమ ఆస్తి ప్రకటనలను సమర్పించాలి, వీటిని స్వతంత్ర సంస్థ పర్యవేక్షించాలి. పేరున్న విశ్రాంత అధికారులు, పౌర సమాజ ప్రతినిధులతో ‘యాంటీ కరప్షన్ కమిషన్’ను ఏర్పాటు చేయవచ్చును. అన్ని ప్రభుత్వ సంస్థల లావాదేవీలు, ఆమోదాలను పారదర్శక డిజిటల్ వ్యవస్థల్లోకి అనుసంధానించాలి. 7. రాష్ట్రంలో 10--15శాతం కుటుంబాలు స్థిరమైన నివాసం, పోషకాహారం లేదా జీవనోపాధి లేక తీవ్ర పేదరికంలో జీవిస్తున్నాయి. ప్రభుత్వం ఈ పేదరికాన్ని నిర్మూలించడానికి ఐదేళ్ల ప్రత్యేక మిషన్‌ను ప్రారంభించవచ్చు. ప్రాథమిక రెండు గదుల ఇల్లు, ఉచిత విద్యుత్ కనెక్షన్లు, రాయితీతో కూడిన ఎల్పీజీ సదుపాయం, బియ్యం కార్డులు, ప్రత్యేక హెల్త్ కార్డులు, చిన్న వ్యాపారాల కోసం జీవనోపాధి గ్రాంట్లు, పిల్లలకు రెసిడెన్షియల్ విద్యా మద్దతు వంటివి అందించాలి. 8. ఉపాధి కల్పనకు, ఆర్థికవృద్ధికి పారిశ్రామికీకరణ కీలకం. అభివృద్ధి కేవలం కొన్ని పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జిల్లాల అంతటా విస్తరించాలి. రాష్ట్రంలో ముఖ్యమైన రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లపై దృష్టి సారించి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల మాస్టర్ ప్లాన్‌ను రూపొందించవచ్చు. విమానాశ్రయాల విస్తరణ, సమగ్ర పారిశ్రామిక మండలాలు పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి సహాయపడతాయి. సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ఒక సంస్థాగత రూపంలోకి తీసుకురావాలి. 9. మీ మొదటి పదవీ కాలంలో కనీసం 10శాతం గ్రామాలు, మున్సిపాలిటీలను మంచి ప్రమాణాలతో కూడిన మోడల్ ‘స్మార్ట్ విలేజ్’, ‘స్మార్ట్ మున్సిపాలిటీలు’గా మార్చవచ్చు. ఈ ప్రాంతాలు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రోడ్లు, ప్రజారవాణా, వ్యర్థాల నిర్వహణ, ఆసుపత్రులు, పాఠశాలలు, పోలీసింగ్, పబ్లిక్ పార్కులు, డిజిటల్ గవర్నెన్స్‌లో ఉన్నత ప్రమాణాలను ప్రదర్శించాలి.ఐ10. అభివృద్ధి విధానంలో మహిళా సాధికారత ప్రధాన కేంద్రంగా ఉండాలి. మహిళల ఆర్థిక భాగస్వామ్యానికి, సామాజిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు (SHGs) బలమైన సాధనాల్లో ఒకటిగా కొనసాగుతున్నాయి. పొదుపు సంఘాల ఉద్యమాన్ని పునరుజ్జీవింపజేయాలి. రుణాలు, రాయితీలు అప్పుల భారంగా కాకుండా ఉత్పాదక ఆస్తులుగాను స్థిరమైన జీవనోపాధిగాను మారేలా చూడటంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.ఐసామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచే నాయకులను చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.

# పాలకుల నిర్దేశాలే న్యాయ నిర్ణయాలా









‘న్యాయవ్యవస్థ విశ్వసనీయత కోల్పోతే ఇక మిగిలేదేమీ ఉండదు. స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ జీవ లక్షణం. అది లేకపోతే.. న్యాయమూర్తులు ఉంటారు, కోర్టులు ఉంటాయి, తీర్పులు ఉంటాయి. అయితే వాటి హృదయమూ, ఆత్మ కనుమరుగైపోతాయి’ అని జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి) అన్నారు. ఇటీవల పుణేలో వెలువరించిన ఒక స్మారకోపన్యాసంలో కేంద్ర ప్రభుత్వ అభీష్టం మేరకే ఒక హైకోర్టు న్యాయమూర్తిని బదిలీ చేస్తున్నామని కొలీజియం స్వయంగా తన మినిట్స్‌లో రికార్డు చేసిందని కూడా ఆయన వెల్లడించారు. రాజ్యాంగానికి నిబద్ధమై స్వతంత్రంగా వ్యవహరించాల్సిన న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఒత్తిడికి లోనవుతూ పనిచేస్తోందని అనడానికి అది ఒక స్పష్టమైన నిదర్శనం.‘న్యాయవ్యవస్థ పార్టీ రాజకీయాలకు దూరంగా, దృఢ చిత్తంతో వ్యవహరించాలి. ప్రభుత్వంలో మార్పులకూ, న్యాయవ్యవస్థకూ ఏ మాత్రం సంబంధం ఉండకూడదు. అది అందరి పట్లా సదుద్దేశం, సానుభూతితో వ్యవహరించాలి కాని ఎవరి పక్షానా కొమ్ముకాయకూడదు’ అని సుప్రీంకోర్టు ప్రారంభ సమావేశంలో తొలి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరిలాల్ జె కానియా ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచిపోయాయి. అది ఎలా అమలువుతుందని సమీక్షించుకుంటే సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణాలు సమున్నతమయ్యాయా లేక దిగజారిపోయాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానికి మన రిపబ్లిక్ చరిత్రలో మొదటి పాతికేళ్లవరకు న్యాయవ్యవస్థ తన ఉనికిని కాపాడుకునేందుకు, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పరిధిని నిర్ణయించడంలో తన వంతు బాధ్యతను నిష్పాక్షికంగా నిర్వర్తించింది. ముఖ్యంగా అధికరణలు 14, 15, 19, 31లను సుప్రీంకోర్టు నిర్వచించింది. ప్రాథమిక హక్కులను మార్చేందుకు ఏ మాత్రం వీలు లేదని 1967లో గోలక్‌నాథ్ కేసులో స్పష్టం చేస్తే, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని 1973లో కేశవానంద భారతి కేసులో మరింత తేటతెల్లం చేసింది. 1971లో అఖండమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ న్యాయవ్యవస్థతో చెలగాటమాడారు. ఆమె చర్యలకు వత్తాసు పలికిన న్యాయవ్యవస్థ పతనానికి పరాకాష్ఠ ఏడీఎం జబల్పూర్ కేసు. వేలాది రాజకీయ ప్రత్యర్థులను, జర్నలిస్టులను అరెస్టు చేసినప్పుడు ప్రజలు తమ ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చా అని అడిగితే సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అత్యంత దుర్మార్గమైన తీర్పు వెలువరించింది. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు ఆర్టికల్ 21 క్రింద జీవించే హక్కే లేదని ఆ ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు--ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎన్ రే, జస్టిస్ పి.భగవతి, జస్టిస్ ఎంహెచ్ బేగ్, జస్టిస్ వై.వి.చంద్రచూడ్ (రెండేళ్ల క్రితం సీజేఐగా రిటైరైన డివై చంద్రచూడ్ తండ్రి)-- ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. ‘ఎమర్జెన్సీ పేరిట కాల్చి చంపినా అడగకూడదంటారా?’ అని ఈ కేసులో నిరసన తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా ప్రశ్నించినప్పుడు ‘మిలార్డ్, చట్టం అదే చెబుతున్నది’ అని నాటి అటార్నీ జనరల్ జవాబిచ్చారట! న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటి రోజులు అనదగిన ఎమర్జెన్సీ తర్వాత సుప్రీంకోర్టు ఎన్నో ఆత్మవిమర్శలు చేసుకుంది. ఎన్నో దిద్దుబాటు చర్యలను తీసుకుంది. ఎమర్జెన్సీ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ రాజ్యాంగమే సుప్రీం అని ప్రకటించింది. అనేక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు అవకాశం కల్పించింది. జైలులో విచారణ లేకుండా కునారిల్లుతున్న వేలాది ఖైదీలను విడుదల చేసింది. కట్టుబానిసలను విముక్తి చేసింది. న్యాయవ్యవస్థలో నియమాకాలకు కొలీజియం పద్ధతిని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రజల హక్కులను, పర్యావరణాన్ని, పనిచేసే మహిళల ప్రయోజనాలను పరిరక్షించింది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా గద్దె దించడాన్ని అడ్డుకున్నది. చట్టసభల్లోనే ప్రభుత్వాలు మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించింది. వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీల ప్రయోజనాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులెన్నో. ఒక దశలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అబ్బురపరిచేలా కనపడింది. ఇవాళ ఎమర్జెన్సీ రోజులు లేకపోవచ్చు. కాని న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయి. జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్ లాంటి న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో ఎవరూ చొరబడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉన్నదని, న్యాయమూర్తుల రాజకీయ, సైద్ధాంతిక అభిప్రాయాలు బెంచ్‌లో నిర్ణయాలను ప్రభావితం చేయకూడదని అన్నారంటే తరిచి చూసుకోవాల్సిన అవసరం ఉన్నది. న్యాయమూర్తులు బయటి నుంచి వచ్చే ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదని, తమకొచ్చే ఆదాయంతో తృప్తిగా జీవించలేని న్యాయమూర్తులను వ్యవస్థనుంచే తొలగించాలని మరో ప్రస్తుత సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. ఒక కళంకిత న్యాయమూర్తి వ్యవస్థకే మచ్చలాంటి వాడని ఆమె వ్యాఖ్యానించారు. ‘నిష్పాక్షికత న్యాయవ్యవస్థ ఆత్మ, స్వతంత్రత న్యాయవ్యవస్థ నరాల్లో ప్రవహించే రక్తం’ అని ఒడిషా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధరన్ అన్నారు. ఆయన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు రాజధానిలో జరిగిన అల్లర్లపై పోలీసులను నిశితంగా ప్రశ్నించారు. దీంతో రాత్రికి రాత్రే ఆయనను మరో హైకోర్టుకు బదిలీ చేశారు. అసలు న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ గురించి వ్యాఖ్యానించాల్సిన అవసరం ఎందుకు వస్తోంది? సామాన్య ప్రజలకు న్యాయం చేయాల్సిన, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సర్వోన్నత న్యాయస్థానం సంపన్నవర్గాలకు, ప్రభుత్వ ప్రయోజనాలకు, రాజకీయ నాయకులకు మాత్రమే అధికంగా ప్రతిస్పందిస్తోందని, పలుకుబడిగల వారికే వేగంగా తీర్పులు వస్తున్నాయని ఎందుకు విమర్శలు చెలరేగుతున్నాయి? ఒక కేసు ఫలానా బెంచి వద్దకు వెళితే ఫలానా నిర్ణయం వస్తుందని చెప్పగలిగే పరిస్థితి ఎందుకు వస్తోంది? ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా న్యాయవ్యవస్థపై రాజకీయ ప్రభావం, దళారీల పాత్రపై అత్యధికంగా చర్చ జరుగుతోంది. దేశం ఒక నియంతృత్వ రాజ్యంగా మారిపోతోందని, రాజకీయంగా సున్నితమైన కేసుల్లో న్యాయం కొరవడిందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుశ్యంత్ దవే మాటలు కొట్టివేయవలసినవి కాదు. రాజకీయంగా సున్నితమైన కేసులను కొన్ని బెంచ్‌లకు కేటాయించడం, రిటైర్ అయిన తర్వాత లభించే పదవుల కోసం న్యాయమూర్తులు అర్రులు చాచడం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఎన్నికల కమిషన్ లాంటి వ్యవస్థలు బలహీనపడిపోయినా సుప్రీం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కొలీజియంలో చర్చించే న్యాయమూర్తుల నియామకాలు, వారి బదిలీలు గతంలో ఎన్నడు లేనంతగా ప్రశ్నార్థకమవుతున్నాయి. న్యాయమూర్తులు ఉన్నత ప్రమాణాలు పాటించాలని, తమ ప్రవర్తన, తాము చేసే ప్రతి చర్య ప్రజల విశ్వాసం చూరగొనేలా ఉండాలని సుప్రీంకోర్టు 1997లో న్యాయవ్యవస్థలో విలువల గురించి ప్రకటించింది. అయితే ఇటీవలి కాలంలో ప్రధాన న్యాయమూర్తి, పలువురు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది ప్రైవేట్ విమానాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు నగరాలకు పర్యటించడాన్ని ‘కాంపైన్ ఫర్ జ్యుడిషియల్ అకౌంటబిలిటీ, రిఫార్మ్స్’ అనే సంస్థ తీవ్రంగా విమర్శించింది. ఇది న్యాయవ్యవస్థ నైతిక ప్రమాణాలను ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి నివాసంలో భారీ ఎత్తున నోట్ల కట్టలు దొరకడం, దానిపై ఎలాంటి చర్యలు లేకపోవడం ఇలాంటి విమర్శలకు మరింత తావిస్తోంది. సమాజం, ముఖ్యంగా యువత ఈ పరిణామాలను గమనిస్తూనే ఉన్నది. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తమను బొద్దింకలతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలకు యువత అందుకే తీవ్రంగా ప్రతిస్పందించింది. ఎలాంటి పనీపాటలేని, ఉద్యోగం రాని యువత బొద్దింకల్లా తయారైందని, వారిలో కొందరు మీడియాలోను, మరికొందరు సోషల్ మీడియాలోనూ, ఆర్టీఐ కార్యకర్తలు, ఇతర కార్యకర్తలుగా తయారయ్యారని, వారు ప్రతి ఒక్కరిపై దాడి చేస్తున్నారని ఆయన ఒక కేసు విచారణ సందర్భంగా విమర్శించారు. తనను సీనియర్ న్యాయవాదిగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఒక న్యాయవాది దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించే సందర్భంగా తాను ఈ వ్యాఖ్యలు చేశానని, యువతను విమర్శించలేదని సూర్యకాంత్ వివరణ ఇచ్చినప్పటికీ ఆయన ఏమన్నారో అప్పటికే వైరల్ కావడంతో ప్రజలు ఆ వివరణను పట్టించుకునే స్థితి దాటిపోయింది. జస్టిస్ సూర్యకాంత్ ఆ వ్యాఖ్యలు చేసిన తర్వాత ‘కాక్రోచ్ జనతా పార్టీ’ పేరిట ఒక యువకుడు సోషల్ మీడియాలో అకౌంట్ ఏర్పర్చుకున్నారు. కోట్లాది యువజనులు దానికి స్పందించారు, ఇంకా స్పందిస్తున్నారు. నిరుద్యోగం, పెట్రోల్ ధరల పెంపు, అవినీతి, కుంభకోణాలకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం మొదలు పెట్టారు. ‘అవును మేము బొద్దింకలమే’ అని యువతీ యువకులు విపరీతంగా స్పందిస్తున్నారు. అసలు వ్యాఖ్యలు చేసింది జస్టిస్ సూర్యకాంత్ అయితే ప్రజలు ప్రభుత్వంపై ఎందుకు విమర్శలు గుప్పిస్తున్నారు? అంటే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వమూ, న్యాయవ్యవస్థ వేరు వేరు కాదని వారు భావిస్తున్నారా? ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వానికీ, న్యాయవ్యవస్థకూ మధ్య సరిహద్దులు చెరిగిపోతే మన ప్రజాస్వామ్య వ్యవస్థకు అంతకు మించి వాటిల్లే ప్రమాదం మరేముంటుంది? ఈ పరిస్థితి నుంచి న్యాయవ్యవస్థే తనను తాను కాపాడుకోవాల్సి ఉన్నది. లేకపోతే బొద్దింకలే న్యాయనిర్ణేతలయ్యే ఆవశ్యకత ఏర్పడుతుంది.

# కూకట్‌పల్లిపై కాంగ్రెస్ మంత్రుల ఫోకస్

-విశ్వనగర లక్ష్యానికి మౌలిక వసతులే బలం..
-62 నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు..
-మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు..
-కూకట్‌పల్లికి మరిన్ని ఇళ్లు, నిధులు కోరిన బండి రమేష్..





కూకట్‌పల్లి, మే 27 ( హంస కలంవార్త )

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలంటే కలుషిత రహిత త్రాగునీరు, మెరుగైన రహదారులు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటు అత్యవసరమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 62 మంది నిరుపేదలకు కేటాయిస్తూ పట్టాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఒక ఇంటిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకుల కేటాయింపు, కొత్త బస్సులను మహిళా సంఘాలకు అందించడం వంటి పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నిరుపేద కుటుంబాలు ఉన్నాయని, వారికి మరిన్ని నిధులు కేటాయించి అదనపు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కలెక్టర్ మనో చౌదరి, జోనల్ కమిషనర్, ఎమ్మార్వో, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# ప్రజల మధ్య మాజీ కార్పొరేటర్ జగన్



జగద్గిరిగుట్ట, మే 27 ( హంస కలంవార్త )

జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందుంటానని మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ స్పష్టం చేశారు. బుధవారం న్యూ రాజీవ్ గాంధీ నగర్‌లో స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించి బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, తాగునీరు, సీసీ రహదారులు, ఇతర మౌలిక వసతుల సమస్యలను జగన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మాట్లాడిన ఆయన, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్‌గా పనిచేసిన కాలంలో డివిజన్ పరిధిలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. న్యూ రాజీవ్ గాంధీ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సదుపాయం, సీసీ రహదారుల నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషి చేసినట్లు చెప్పారు. మౌలిక వసతుల కల్పన అనేది నిరంతర ప్రక్రియ అని, ఇంకా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిలు యాదవ్, ఆంజనేయులు సాగర్, భీమ్లా నాయక్, హనుమంతు యాదవ్, నాగేందర్, విటల్, మహేష్, పోచయ్య, సురేష్, కొండల్, రవికుమార్, మహేష్ యాదవ్, మల్లేష్ పాల్గొ

# మ్యాన్‌హోల్ పేలి రోడ్డుపై వరదనీరు



ఆల్విన్ కాలనీ, మే 27 ( హంస కలంవార్త )

ఉషముల్లపూడి ప్రధాన రహదారిలో ఎల్లమ్మ చెరువు పెట్రోల్ బంక్ సమీపంలో మ్యాన్‌హోల్ పగిలిపోవడంతో వరదనీరు రోడ్డుపైకి పొంగి ప్రవహించి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జలమండలి అధికారులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మ్యాన్‌హోల్ దెబ్బతినడంతో నీరు రహదారిపైకి చేరిందని తెలిపారు. సమస్యను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వరదనీరు రోడ్డుపైకి రాకుండా నివారణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. డ్యామేజ్ అయిన మ్యాన్‌హోల్‌ను పూర్తిగా పునరుద్ధరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, సర్వేష్, శివ పాల్గొన్నారు..

# తెలంగాణ లో రానున్నది కూటమి ప్రభుత్వమే



మే 27 ( హంస కలంవార్త )

టీ3లంగాణ రాష్ట్రం లో రానున్న ఎన్నికలలో కూటమి సర్కార్ కొలువుదీరుతుందని నిజామాబాద్ పార్లమెంట్ తెలుగుదేశం ఇంచార్జి యాదగౌడ్ తెలిపారు.మంగళగిరి లో జరుగుతున్న మహానాడు కు వెళ్లాల్సి ఉండగా చమురు పొదుపు పెరిగిన ఎండల వల్ల అందరూ అక్కడికి రాకుండా పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారన్నారు.అందులో భాగంగా జిల్లా.పార్టీ కార్యాలయం లో ఎల్ ఈ డి తెరను ఏర్పాటు చేసుకొని మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఇంచార్జి యాదగౌడ్ మాట్లాడుతూ అణగారిన బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం నాడు ఎన్టీఆర్ పార్టీ స్థాపించారని పేర్కొన్నారు.పేద ప్రజల కోసం కుడు,గూడు,గుడ్డ అందించాలన్న సంకల్పం తో చేపట్టిన పథకాలను నేటికి అన్ని ప్రభుత్వాలు పేర్లు మరిచి కొనసాగిస్తున్నాయని చెప్పారు.నేటికి ప్రజలలో తెలుగు దేశం అంటే అభిమానం ఉందన్నారు.పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హయం లో హైదరాబాద్ నగరం ప్రపంచ దేశాల సరసన నిలిచేలా ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.ఆన్ లైన్ మహానాడులో పాల్గొన్న నాయకులు ఆన్ లైన్ ద్వారా హాజరు వేసుకున్నారు యాంకర్;44 సంవత్సరాల క్రితం వెలిసిన తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరం మహానాడు జరిపి పార్టీ ఎదుగుదల కోసం ప్రణాళిక ను సిద్ధం చేస్తారు.ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు,చమురు పొదుపు వల్ల అందరూ మహానాడు వేదిక వద్దకు వెళ్లకుండా పరిమితం చేసి పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యాలయాల్లో ఈ వేడుకలు జరుపుకున్నారు. వాయిస్:నిజామాబాద్ తెలుగు దేశం పార్టీ కార్యాలయం మహానాడు వేడుకలను జరుపుకున్నారు.మూడు రోజుల.పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు.మొదటి రోజు పార్టీ అధినేత ప్రసంగాన్ని ఎల్ ఈ డి స్క్రీన్ పై తిలకించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ ఇంచార్జి యాదగౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పడ్డ పార్టీ తెలుగు దేశం అన్నారు.ప్రతి కుటుంబానికి కుడు,గూడు,గుడ్డ కావాలన్న సంకల్పం తో పార్టీ అధినేత ఎన్టీఆర్ తెలుగుదేశాన్ని స్థాపించారని పేర్కొన్నారు.నాడు అమలు చేసిన పథకాలే నేడు కొనసాగిస్తున్నారని పేర్ల మార్పు తప్ప మరొకటి లేదన్నారు.రానున్న ఎన్నికలలో తెలంగాణలో సైతం కూటమి ప్రభుత్వం కొలువు దీరుతుందని పేర్కొన్నారు.మొదటి రోజు ముఖ్య కార్యకర్తలు మహానాడు సమావేశం లో.పాల్గొన్నారు

# కళ్లాల వద్ద రైతుల కష్టాలు

-అన్ని కళ్లాల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి..
-రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు హెచ్చరిక..
-కొనుగోళ్లలో ఆలస్యం చేస్తే ఆందోళనలు తప్పవు..
-ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన దుర్గం అశోక్..



హంస కలంవార్త మే 27 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

కోటపల్లి మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం కొనుగోలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చెన్నూర్ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్ ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. మండల పరిధిలోని అన్ని కళ్లాల వద్ద ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దుర్గం అశోక్ మాట్లాడుతూ, రైతులు తీవ్ర ఎండల మధ్య పంటను కళ్లాలకు తీసుకొచ్చినా సరైన సమయంలో కొనుగోళ్లు జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాల ముప్పు నేపథ్యంలో ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకోవడం కాకుండా, కళ్లాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కళ్లాలో తూకం యంత్రాలు, హమాలీలు, తార్పాలిన్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు రోజుల తరబడి కళ్లాల వద్ద పడిగాపులు కాచే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. రైతుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని దుర్గం అశోక్ హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు స్థానిక రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు..

# పెన్షన్ లబ్ధిదారులకు కీలక ప్రకటన



శేర్లింగంపల్లి, మే 27 ( హంస కలంవార్త )

తెలంగాణ ప్రభుత్వం ద్వారా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు తప్పనిసరిగా పెన్షన్ పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ ప్రక్రియ ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు తీసుకుని స్వయంగా సమీప కేంద్రాలకు వెళ్లి రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. నిర్దేశిత గడువులోపు పునరుద్ధరణ చేయించుకోని వారి పెన్షన్ నిలిపివేయబడే అవకాశం ఉందని హెచ్చరించారు. లబ్ధిదారులు చివరి రోజులకు వేచి చూడకుండా, రద్దీని నివారిస్తూ విడతల వారీగా కేంద్రాలకు వెళ్లి సిబ్బందికి సహకరించాలని కోరారు. రెన్యువల్ కేంద్రాలు:

-శంషిగూడ వార్డ్ కార్యాలయం

దత్తాత్రయ కాలనీ సాయిబాబా ఆలయం ఆల్విన్ కాలనీ ఫేజ్-2 కమ్యూనిటీ హాల్ గమనిక: లబ్ధిదారులు స్వయంగా హాజరుకావడం తప్పనిసరి. ఆధార్ కార్డు వెంట తీసుకురావాలి..

# అమృత్‌నగర్ తాండాకు ఇండ్ల పండుగ





ఫతేనగర్, మే 27 ( హంస కలంవార్త )

అమృత్‌నగర్ తాండాలో గిరిజనులకు చెందిన 62 కుటుంబాలకు ఇండ్ల పంపిణీ కార్యక్రమం, కూకట్‌పల్లి, మూసాపేట్--కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ పిలుపు మేరకు వసంత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలతో కూకట్‌పల్లి నియోజకవర్గం రూపురేఖలు మారనున్నాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు బండి రమేష్, మందలపు సాయిబాబు చౌదరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూభారతిలో ఎలా మారింది?

-రూ.1000 కోట్ల భూకుంభ కోణం బయటపెట్టిన మాజీమంత్రి హరీష్ రావు

-ప్రభుత్వభూములుప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు

-తెలంగాణభవన్ లో జరిగినమీడియాసమావేశం లో భూస్కామ్ వివరాలు వెల్లడి



హంసకలం వార్త

శంషాబాద్‌లో రూ.1000 కోట్ల భూ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అధికార కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరుస స్కామ్ లు జరుగుతున్నాయంటూ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకు ఆయన శంషాబాద్‌లో రూ.1,000 కోట్ల భూ కుంభకోణం జరిగిందంటూ వివరాలు బహిర్గతం చేశారు.

-తెలంగాణభవన్ లోజరిగిన మీడియా సమావేశంలో భూస్కామ్ వివరాలు వెల్లడి

శంషాబాద్ పరిధిలోని పెద్దషాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 172 నుండి 180 లో ఉన్న 94.73 ఎకరాల ప్రభుత్వ భూమి వివాదంలో తగిన నిర్ణయం తీసుకోవాలని 30--01--2026 నాడు హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఈ భూమిని నిషేధిత జాబితాలో పెట్టాలని, అక్రమార్కుల నుండి కాపాడాలని 24--2--2026 నాడు ఆర్డీవో తహశీల్దార్ కు ఆర్డర్ జారీ చేశాడని, అదే విధంగా హైకోర్టులో కూడా అఫిడవిట్ వేశాడని హరీశ్ రావు తెలిపారు. కానీ 28--02--2026 నాడు తహశీల్దార్ ఆ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు చెందినదిగా ఆర్డర్ పాస్ చేసి, హైకోర్టుకు కూడా ప్రైవేట్ వ్యక్తుల భూమి అని తెలిపాడని వెల్లడించారు. ఒకే భూమిని ఆర్డీవో ప్రభుత్వ భూమి అంటాడు, తహశీల్దార్ ప్రైవేట్ భూమి అంటాడని, అసలు కలెక్టర్ అప్రూవల్ లేకుండా ఆర్డీవో, తహశీల్దార్ భూమి గురించి హైకోర్టులో పిటిషన్ ఎలా వేసారు? అని హరీశ్ రావు నిలదీశారు. ఈ భూస్కామ్ వెనుక రేవంత్ రెడ్డి, అతని ముఖ్య అనుచరుడైన ఓ కార్పొరేషన్ చైర్మన్ , ఒక మంత్రి ఉన్నారని ఆరోపించారు. ఈ సర్వే నెంబర్ లోని 94.73 ఎకరాలతో పాటు మరో 176 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఫైల్ సిద్ధమైనట్లు సమాచారం ఉందని, మొత్తం 270 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి దాదాపు రూ.1,000 కోట్ల కుంభకోణానికి సొసైటీ వైస్ చైర్మన్ తెరలేపారని, ఈ అంశం వివాదాస్పదం అవ్వడంతో తహశీల్దార్‌ను పిలిపించి తను ఇచ్చిన ఉత్తర్వులు గురించి ఏసీబీ విచారణ సైతం చేపట్టిందని తెలిపారు. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూభారతిలో ఎలా మారింది? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు ఆ భూమిని భూ భారతిలో ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద బదిలీ కూడా చేశారు అని, 24--05--2026 తేదీన ప్రైవేట్ వ్యక్తుల పేరిట మొత్తం 170 ఎకరాలను భూ భారతిలో ఎక్కించారు అని తెలిపారు.చట్ట ప్రకారం ఆర్డీవో దరఖాస్తు చేసుకుని, నిర్ణీత సమయంలో ఆర్డీవో నిర్ణయం తీసుకోవాలని, కానీ ఇక్కడ ఆర్డీవో ప్రమేయం లేకుండా తహశీల్దార్ నిర్ణయం తీసుకున్నాడన్నారు. ఇదంతా బయటపడగానే గుట్టుచప్పుడు కాకుండా తహశీల్దార్ ను సస్పెండ్ చేశారన్నారు. ఈ ప్రైవేట్ వ్యక్తుల జాబితాలో మంత్రుల కుటుంబ సభ్యుల పేర్లు కూడా ఉన్నాయని హరీశ్ రావు వెల్లడించారు.

## కొనుగోళ్ళు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



హంసకలం వార్త

తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. బుధవారం గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.ఇప్పటివరకు ఈ కేంద్రంలో ఎంత ధాన్యం సేకరించారు ఎంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ ఆరా తీయగా,ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని,తూకం వేసిన బస్తాలను మిల్లుకు వాహనాల ద్వారా తరలిస్తున్నామని కలెక్టర్ కు వివరించారు.తూకం వేసిన బస్తాలను జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల నుండి తరలించాలని కలెక్టర్ సూచించారు.ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై ఆరా తీశారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ముందుగానే టార్పాలిన్లు సరిపడా అందుబాటులో పెట్టుకోవడం ద్వారా వర్షాలకు ధాన్యం తడవకుండా ఉంటుందని అన్నారు.కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు తరలించిన అనంతరం మిల్లులో అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.సన్న రకాల సాగుపై దృష్టి సారించాలని రైతులను కోరారు. తనిఖీలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం,తహసీల్దార్ మారుతి రెడ్డి,ఎంపీడీఓ రాజేందర్ తదితరులు ఉన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో కోహెడలో పండ్ల మార్కెట్

-తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వ చర్యలు

-ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

-జూన్ 3న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

-అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి దిశా నిర్దేశం

-సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్ ,సీపీ





హంసకలం వార్త

అంతర్జాతీయ ప్రమాణాలతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడలోని సర్వే నెంబర్ 167లో పండ్ల మార్కెట్ ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలోనే అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగిందని అదే తరహాలో సకల హంగులతో పండ్ల మార్కెట్ నిర్మించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా, ఇదే ప్రాంతంలో సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. వచ్చే 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పండ్ల మార్కెట్, సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు శంకుస్థాపన జరగనుంది. ఇందుకోసం మార్కెట్ నిర్మించతలపెట్టిన ప్రాంతంలో అధికారయంత్రాంగం ఏర్పాట్లలో తలమునకలైంది. సీఎం పర్యటన, మార్కెట్, రిజిస్ట్రేషన్ కార్యాలయ శంకుస్థాపన ఏర్పాట్లను ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, మల్కాజ్ గిరి సీపీ సుమతి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి దిశానిర్దేశం చేసి, భద్రత చర్యలపై సీపీతో చర్చించారు. అలాగే, సీఎం పర్యటన, పనుల ప్రారంభోత్సవం గురించి కలెక్టర్ తో చర్చించారు. గడ్డి అన్నారం నుంచి తరలించి, ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న మార్కెట్ ను ముఖ్యమంత్రి సూచనల మేరకు అంతర్జాతీయ స్థాయిలో నిర్మించేలా నిర్ణయం జరిగిందని చెప్పారు. ఈ మేరకు కోహెడలోని ప్రభుత్వ భూములను గుర్తించి, మార్కెటింగ్ శాఖకు అప్పగించినట్లు చెప్పారు. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తైతే అటు పండ్ల విక్రయదారులు, వ్యాపారులు, వినియోగదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మధ్యదళారీల బెడద లేకుండా ప్రజలే నేరుగా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు జరుగుతాయన్నారు. అదేవిధంగా, మరో 4ఎకరాల్లో సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణం జరగనున్నట్లు చెప్పారు.మౌలిక వసతులు, సకల హంగులతో ఈ కార్యాలయాలు రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగిసేలా అధికారులు దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

# పారదర్శకంగా పనులు నిర్వహించాలి

-నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



హంసకలం వార్త

బుధవారం ఉదయం అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని బల్మూర్ మండలం లోని కొండనాగుల గ్రామం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రోడ్డు చదును పనులను హేమంత్ కేశవ్ పాటీల్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పనుల పురోగతిని ఆయన నేరుగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండనాగుల గ్రామం లో పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కూలీలతో ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ హాజరు నమోదు, కూలి చెల్లింపులు సమయానికి అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడి పనిస్థలాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ముఖ్యమైన పథకమని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న రోడ్డు చదును, చెరువుల అభివృద్ధి, వాననీటి సంరక్షణ వంటి పనులు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి పనిని పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. గ్రామస్తులు కూడా పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, గ్రామ రహదారుల అభివృద్ధితో రాకపోకలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి తాహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

-అకాల వర్షాలకు రైతులకు ఇబ్బంది కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

-మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



హంసకలం వార్త

వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, మెట్ పెల్లి మండలం రామ లచ్చక్క పేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి , తహసీల్దార్ లు , ఎంపిడివోలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశం

-న్యాక్ ద్వారా శిక్షణ -- ఉపాధి కల్పన కార్యక్రమం



హంసకలం వార్త

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా ఎలక్ట్రిషియన్, ప్లంబర్, మేసన్, టైలరింగ్ ట్రేడ్లలో మూడు నెలల శిక్షణ కార్యక్రమం ప్రారంభించబడుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల శిక్షణ కాలానికి గాను రూ. 18,000 రుసుము ఉండగా, జిల్లా యంత్రాంగం తరపున 50 శాతం రాయితీని కల్పిస్తామని అన్నారు. అభ్యర్థులు కేవలం రూ. 9000 రుసుము(నెలకు మూడు వేల చొప్పున) మాత్రమే చెల్లించి, పై ట్రేడ్ లలో శిక్షణ పొందవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో అనుభవజ్ఞులైన ట్రైనర్లచే అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రాక్టికల్స్ తో పాటు థియరీలో నాణ్యమైన శిక్షణ అందించబడుతుందని అన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని కలెక్టర్ తెలిపారు శిక్షణ సందర్భంగా ఉచిత యూనిఫామ్, ఉచిత స్టేషనరీ, అధునాతన, సాంకేతికతతో కూడిన యంత్ర పరికరాలతో ప్రాక్టికల్ ట్రైనింగ్, అనుభవజ్ఞులైన ఇన్స్ట్రక్టర్లచే సమర్థవంతమైన శిక్షణ, న్యాక్ ద్వారా గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందిచబడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు కలిగిన న్యాక్ సంస్థ ద్వారా ఇదివరకు వివిధ ట్రేడ్లలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పూర్తి స్థాయిలో 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పించబడినాయని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. శిక్షణ తరగతులను న్యాక్ అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ జరుపుతారని, అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా కృషి చేస్తారని అన్నారు. పదవ తరగతి ఆ పై విద్యార్హతలు కలిగి ఉండి, 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ప్రస్తుతం ఎలక్ట్రిషియన్, ప్లంబర్, మేసన్, టైలరింగ్ ట్రేడ్లలో మూడు నెలల శిక్షణ పొందేందుకు అర్హులని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు 2026 జూన్ 09వ తేదీ లోపు నిజామాబాద్ కలెక్టరేట్ సమీపంలో గల న్యాక్ కేంద్రంలో నేరుగా దరఖాస్తులను అందించవచ్చని అన్నారు. వివరాలకు న్యాక్ కేంద్రం సహాయ సంచాలకులు లింబాద్రి, సెల్ నెంబర్: 9296507557 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

-గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ కావాలి...నిర్లక్ష్యానికి తావులేదు
-సీట్లు భర్తీ కాని పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలి..
-ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలి..
-వైద్యులు ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి..
-పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి..
-గురుకుల స్వంత భవనాల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలి..
-గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..

హంసకలం వార్త

రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతి



విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలోనే అవసరమైన మరమ్మతులు, మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో



ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ సంబంధిత అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

-పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన
-చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ

హంసకలం వార్త



బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 18 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని , సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని , సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాధ్యత గా తీసుకోవాలి. నగల దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరా లు పెట్టుకోవాలి. బస్సాపూర్ గ్రామంలో 18 కెమెరాలు పెట్టి సహకరించిన గ్రామ పంచాయతీని సీపీ అభినందించారు. ఈ సందర్భంగా బస్సాపూర్ గ్రామంలో డ్రగ్స్ నివారణ , సైబర్ క్రైమ్ పట్ల అవగాహన, రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం అన్నీ రకాల జాగ్రత్త లు తీసుకోవాలని అన్నారు. పంటపొలాలలో ఎవరు కూడా మంటలు పెట్టారాదని , అందుకోసం మల్టీ పోటాషియం మందులు వాడినట్టుయితే భూ సంద్రత బాగుంటుంది అన్నారు. ముప్కాల్ మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన పోలీస్ స్టేషన్ భవన పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి , నాణ్యత , సౌకర్యాల ఏర్పాటు తదితర అంశాలను అధికారులు మరియు ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి సమీక్షించారు. పోలీస్ స్టేషన్ భవనం ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా, ఆధునిక సౌకర్యాలతో నిర్మించబడాలని సూచించారు. భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బందికి అవసరమైన కార్యాలయ గదులు , రిసెప్షన్ సెంటర్ , రికార్డు గదులు , మహిళా సిబ్బంది కోసం ప్రత్యేక సౌకర్యాలు , భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై కూడా కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని దూద్ గామ్ చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ డిస్ట్రిక్ బార్డర్ చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర సరిహద్దుల ద్వారా అక్రమంగా పశువులను తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని , అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల తనిఖీల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించడం, బ్యారికేడ్లు మరియు హెచ్చరిక లైట్లు వినియోగించడం , వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో నిలిపి తనిఖీలు నిర్వహించడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చట్ట విరుద్ధంగా పశువుల రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ రూరల్ సి.ఐ జాన్ రెడ్డి , మెండోరా ఎస్. ఐ సుహాసిని, మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యసభకు సిద్దరామయ్య సీఎంగా డీకే శివకుమార్

-కర్ణాటకలో సీఎం మార్పుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
-కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత
-హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా

హంసకలం వార్త

కర్ణాటకలో సీఎం మార్పుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. సిద్ధరామయ్య రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం కానున్నారన్న ప్రచారం జోరందుకుంది.

-హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు సీఎంపదవికి సిద్ధరామయ్య రాజీనామా

కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో,ప్రభుత్వంలో కీలక మార్పులకు కారణమవుతుంది. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నట్లు గాసమాచారం. ఆయనను రాజ్యసభకు రావాలని హైకమాండ్ సూచించిందని కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడుతారని కాంగ్రెస్ వర్గాల కథనం. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత నడుమ నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్ డీకే శివకుమార్,సిద్ధరామయ్యతో రోజంతా చర్చలు జరిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ




వేణుగోపాల్, కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా తో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు కర్ణాటక కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023లో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీలో భాగంగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చి తీరాలని అగ్రనేతల ముందు డీకే శివకుమార్ మరోసారి తన వాదన వినిపించారు. ప్రతిగా సిద్ధరామయ్య తను సీఎంపదవివదులుకోవాల్సి వస్తే ఎస్సీ వర్గానికి చెంది పరమేశ్వర్ ను సీఎం చేయాలని మెలిక పెట్టారు. అయితే అన్ని వర్గాల వాదనలపై భేటీలో సుదీర్ఘ చర్చ అనంతరం కర్ణాటక సీఎం మార్పుపైన, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైన కాంగ్రెస్ హైకమాండ్ పలు




కీలక నిర్ణయాలు తీసుకుంది. సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకొని, రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సహకరించాలని అధిష్ఠానం సూచించి నట్లు సమాచారం. అతనికి రాజ్యసభ స్థానంతో పాటు ఆ సభలో విపక్ష నేతగానూ అవకాశం ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది. అధిష్టానం నిర్ణయం నేపథ్యంలో రేపు బెంగుళూరులో కేబినెట్ మీటింగ్ తర్వాత సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నారు గురువారం తొలుత సహచర మంత్రులకు అల్పాహార విందు ఇచ్చి, అనంతరం బెంగళూరులో ని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. నూతన సీఎం డీకే శివకుమార్ సారధ్యంలోని కేబినెట్ లో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రకు ఉపముఖ్యమంత్రిగానూ అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం.సిద్ధరామయ్య ను రాజ్యసభ కు ఎంపిక చేయడం ద్వారా ఆయన సేవలు దేశవ్యాప్తం గా పార్టీ కోసం ఉపయోగిం కుంటా మని రాహుల్ గాంధీ భరోసా ని చ్చినట్లుగా తెలుస్తుంది.

# అరుదైన శస్త్ర చికిత్స ఓ రోగికి 20 సెం.మీ. కిడ్నీ కణితి తొలగింపు

-మూత్రపిండాలవద్ద గుమ్మడి కాయ పరిమాణం లో ఉన్న కణితిని చూసి షాకింగ్!
-ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి డాక్టర్లు శస్త్రచికిత్స

హంసకలం వార్త



పొత్తికడుపు వాపు, అలసట తో ఆస్పత్రిలో చేరిన రోగికి పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు షాకయ్యారు. అతని మూత్రపిండాల వద్ద గుమ్మడికాయ పరిమాణం లో ఉన్న కణితిని చూసి ఆశ్చర్యపోయారు.ఏ మాత్రం ఆలస్యం చేయకుండా శస్త్ర చికిత్స నిర్వహించి,ఆ కణితి ని తొలగించారు.ఈ అరుదైన శస్త్ర చికిత్సకు బంజారాహిల్స్‌లోని ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి వేదికైంది. ఆంధ్రప్రదేశ్ కర్నూల్ జిల్లాకు చెందిన 53 ఏళ్ల వ్యక్తి గత కొంతకాలంగా పొత్తి కడుపు వాపుతో బాధపడుతున్నాడు అంతేకాదు అలసటగా మారిపోవడం, ఆకలి లేకపోవడం వంటి విషయాలు అతన్ని మరింత ఆందోళనకు గురి చేశాయి. దీంతో ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి వైద్యులను ఆశ్రయించాడు. ఇక వైద్యులు అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా షాకింగ్ విషయం వెలుగు చూసింది. కిడ్నీ వద్ద ఓ భారీ కణితిని వైద్యులు గుర్తించారు. పేగులను పక్కకు తోసేసి పొత్తికడుపు వరకు ఆ కణితి వ్యాపించింది మొత్తానికి వైద్యులు డాక్టర్ పూర్ణచంద్ర రెడ్డి, డాక్టర్ రాజేశ్ కుమార్ రెడ్డి కలిసి శస్త్ర చికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. అయితే ఈ కణితి 20 సెంటిమీటర్ల పరిమాణంలో ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాధిత రోగి కోలుకుంటున్నారని వైద్యులు స్పష్టం చేశారు. అయితే ఆ కణితి క్యాన్సర్ కారకమని తర్వాత పరీక్షల్లో నిర్ధారించారు. ముందస్తుగానే అప్రమత్తం కావడంతో సదరు రోగి ప్రాణాలతో బయటపడ్డాడని వైద్యులు పేర్కొన్నారు. అధునాతన వైద్య సదుపాయాలను ఉపయోగించి శస్త్ర చికిత్స నిర్వహించామని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ నగరంలోని ఆర్టీఏ ఆఫీసుల్లో ఏసీబీ మెరుపు దాడులు

-కొండాపూర్‌తో పాటు నాగోల్ ఉప్పల్, పలు ప్రాంతాల్లో ఏసీబీ ఏకధాటిగా సోదాలు
-ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ దాడులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
-ఏసీబీ తాజా దాడులతో అక్రమార్కుల గుండెల్లో

హంసకలం వార్త

హైదరాబాద్ నగరంలోని ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ దాడులతో ఒక్కసారిగా కలకలం రేగింది. కొండాపూర్‌తో పాటు నాగోల్, ఉప్పల్, పలు ప్రాంతాల్లో ఏసీబీ ఏకధాటిగా సోదాలు చేపట్టింది మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయం లో ఏసీబీ డీఎస్పీ లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహిస్తున్నారు.కొండాపూర్ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ సెంట్రల్ పరిధిలోని నాగోల్ జగ్జీవన్ రామ్ ఆర్టీఏ కార్యాలయం లో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర వాహన రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరుగుతున్నాయనే సమాచారంతో హైదరాబాద్ రేంజ్ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో ఏసీబీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఆర్టీఏ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కార్యాలయంలోని ఎంవీఐలు, ఏఎంవీఐలను సైతం ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు అక్రమ లావాదేవీలకు పాల్పడుతు న్నారనే ఆరోపణలతో ఏజెంట్ల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌లను పరిశీలిస్తున్నారు. లైసెన్స్‌ల జారీ, రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇక నాగోల్‌లోని జగ్జీవన్ రామ్ ఆర్టీఏ (హైదరాబాద్ సెంట్రల్) కార్యాలయంలో హైదరాబాద్ రేంజ్ డీఎస్పీ




గంగసాని శ్రీధర్ నేతృత్వం లో దాడులు కొనసాగుతున్నాయి. ఆర్టీఏ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను అధికారులు తమదైన శైలిలో విచారిస్తు న్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఏజెంట్ల ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు నడుస్తున్నాయనే పక్కా సమాచారంతోనే ఏసీబీ ఈ మెరుపు దాడులు చేపట్టింది. కార్యాలయాల్లోని రికార్డులను, నగదును అధికారులు నిశితంగా పరిశీ లిస్తున్నారు. ఏసీబీ తాజా దాడులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి

# బిజినెస్

## మార్కెట్ రేసులో దూసుకుపోతున్న అదానీ పవర్!



భారత స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్‌నకు చెందిన 'అదానీ పవర్' సరికొత్త మైలురాయిని అందుకుంది. దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌ను వెనక్కి నెట్టి అత్యంత విలువైన కంపెనీల జాబితాలో ముందుకు దూసుకెళ్లింది. ఈ ఏడాది ఇప్పటివరకు షేర్ల ధర ఏకంగా 68 శాతం మేర పెరగడంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అదానీ పవర్ ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.

**దేశంలో 11వ స్థానానికి**

నేటి ట్రేడింగ్‌లో అదానీ పవర్ షేరు దాదాపు 3 శాతం లాభపడి రూ.252 వద్ద సరికొత్త 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. ఈ భారీ పెరుగుదలతో కంపెనీ మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.4.85 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.4.72 లక్షల కోట్ల వద్దే నిలిచిపోయింది. దీంతో దేశంలోనే అత్యంత విలువైన కంపెనీల జాబితాలో అదానీ పవర్ 11వ స్థానానికి ఎగబాకింది.

**ఎల్‌నినో ఎఫెక్ట్**

దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు అదానీ పవర్ షేర్లకు కలిసొచ్చాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల తీవ్రమైన ఎండలు ముదరడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. మే 22 నాటి గణాంకాల ప్రకారం.. ప్రపంచంలోని అత్యధిక ఉష్ణోగ్రత్తలు నమోదైన 100 నగరాల్లో 97 భారతదేశంలోనే ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో విద్యుత్ కంపెనీల షేర్లకు స్టాక్ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

## డేటా సెంటర్ల హబ్‌గా భారత్.. ఆసియా-పసిఫిక్‌లో రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత



భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో కీలక స్థానానికి చేరుకుంటోంది. ఆసియా-పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థ్యం ఉండగా.. మరో 3.1 గిగావాట్ల సామర్థ్యం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నేడు విడుదల చేసిన తాజా నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఈ మార్పు పై కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థ్యం అత్యంత కీలకంగా మారాయి" అని వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా భారత్ పటిష్ఠమైన స్థితిలో ఉందని, బలమైన డిమాండ్, విస్తరిస్తున్న డెవలప్‌మెంట్ పైప్‌లైన్, బహుళ నగరాల పర్యావరణ వ్యవస్థ దీనికి దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు.

**గ్లోబల్ డేటా సెంటర్ మార్కెట్‌లో హైదరాబాద్‌కు 9వ ర్యాంక్**

భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలుస్తోంది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. ఇక హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు కూడా ఈ వృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది. భారతదేశ దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలు కూడా ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆపరేటర్లు పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 10.5 గిగావాట్లకు పైగా సామర్థ్యం ఇంకా భూమి దశలోనే ఉందని, ఇది రాబోయే రోజుల్లో భారీ అభివృద్ధికి సంకేతమని నివేదిక పేర్కొంది.

## చెస్ టోర్నీలో గుకేశ్‌కు వింత అనుభవం.. వైరల్‌గా మారిన 'వాటర్ బాటిల్' వీడియో!



- నార్వే చెస్‌లో గుకేశ్ బాటిల్ వీడియో వైరల్
- వెస్లీ చేతిలో ఓడిన భారత గ్రాండ్‌మాస్టర్
- 116 ఎత్తుల సుదీర్ఘ పోరు డ్రాగా ముగింపు
- ఆర్మగెడాన్ రౌండ్‌లో వెస్లీ సో ఘన విజయం
- గాయంతోనూ ప్రజ్ఞానందపై గెలిచిన అలిరెజా ఫిరౌజా

నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్‌కు వింత, సరదా అనుభవం ఎదురైంది. వెస్లీ సోతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ మధ్యలో గుకేశ్ వాటర్ బాటిల్ క్యాప్ తీయడానికి పడ్డ తిప్పలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆటలో తీవ్రంగా ఆలోచిస్తూ పక్కనే ఉన్న బాటిల్ మూత తీయడానికి ప్రయత్నించి అది రాకపోవడంతో అతడు బిక్కమొహం వేసిన విజువల్స్ నెటిజన్లను నవ్విస్తున్నాయి.

**చేజారిన విజయం**

క్లాసికల్ రౌండ్-2 మ్యాచ్‌లో అమెరికా ఆటగాడు వెస్లీ సోపై గుకేశ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఏకంగా 116 ఎత్తుల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ పోరులో గుకేశ్ విజయం సాధించేలా కనిపించాడు. అయితే వెస్లీ అద్భుతంగా డిఫెన్స్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించగలిగాడు. తర్వాత ఫలితం కోసం నిర్వహించిన 'ఆర్మగెడాన్' (టై బ్రేకర్) మ్యాచ్‌లో వెస్లీ పైచేయి సాధించి 1.5 పాయింట్లు ఖాతాలో వేసుకోగా, గుకేశ్ కేవలం ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**వెస్లీ వివాదాస్పద వ్యాఖ్యలు**

సుదీర్ఘ పోరాటం తర్వాత ఓటమి పాలవడంతో గుకేశ్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన అసంతృప్తిని దాచుకోలేకపోయాడు. దీనికి తోడు వెస్లీ మాట్లాడుతూ.. గుకేశ్ ప్రస్తుత రేటింగ్ అతడి అసలు ప్రతిభకు అద్దం పట్టడం లేదంటూ కాస్త వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు ఈ ఓటమి మానసికంగా కాస్త నిరాశ కలిగించింది.

**గాయంతోనూ గెలిచిన ఫిరౌజా**

టోర్నీలోని ఇతర మ్యాచ్‌ల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. అలిరెజా ఫిరౌజా చీలమండ గాయంతో బాధపడుతూ, చేతికర్రల సాయంతో నడుస్తూనే భారత ఆటగాడు ప్రజ్ఞానందపై ఘన విజయం సాధించి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సైతం జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో ఓడిపోయే ప్రమాదం నుంచి తప్పించుకుని, ఆర్మగెడాన్ రౌండ్‌లో ఈ టోర్నీలో తన మొదటి విజయాన్ని నమోదు చేశాడు.

# స్పోర్ట్స్

## ధోనీ భవిష్యత్తు పై సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ కీలక ప్రకటన!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. సీఎస్కే అంటే ధోనీ, ధోనీ అంటే సీఎస్కే అనేంతలా ఆ జట్టుతో అతడి బంధం ముడిపడిపోయింది. అయితే, మోకాలి గాయం కారణంగా ధోనీ ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో అతడి ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు క్రికెట్ వర్గాల్లో జోరందుకున్నాయి. ఈ ఊహాగానాల పై సీఎస్కే జట్టు సీఈవో కాశీవిశ్వనాథన్ స్పందిస్తూ ఒక సంచలన ప్రకటన చేశారు. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా అతడి వ్యక్తిగత ఇష్టానికే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. "ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. అతడు ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది" అని సీఈవో వెల్లడించారు. ధోనీ ఇంకా తన రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి అతడు సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో లేదా సపోర్ట్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే వార్తలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా, సీఎస్కే హెడ్ కోచ్ పదవికి ధోనీని మించిన అర్హుడు మరెవరూ లేరని మాజీలు కూడా అభిప్రాయపడుతున్నారు.

# ఇలా అయిపోయాడేంటి... 'లుంగి డ్యాన్స్' సింగర్ హనీ సింగ్ కు ఏమైంది

- తన మానసిక ఆరోగ్య సమస్యలపై మాట్లాడిన సింగర్ హనీ సింగ్
- బైపోలార్ డిజార్డర్ కారణంగా ఏడేళ్లు గదికే పరిమితమయ్యానని వెల్లడి
- తాను చనిపోయానని, నరకంలో ఉన్నానని భ్రమపడినట్లు వ్యాఖ్య
- మందుల వల్ల 105 కిలోల బరువు పెరిగి బట్టతల వచ్చిందన్న సింగర్
- ప్రస్తుతం కోలుకుంటున్నానని, ఇది విగ్గేనని ఓపెన్‌గా వెల్లడి



లుంగి డ్యాన్స్ సాంగ్ తో దేశవ్యాప్త పాప్యులారిటీ సంపాదించుకున్న ప్రముఖ సింగర్, ర్యాపర్ హనీ సింగ్ తన మానసిక ఆరోగ్య సమస్యలపై సంచలన విషయాలు వెల్లడించారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన కెరీర్ ఉచ్ఛస్థాయిలో ఉన్నప్పుడే బైపోలార్ డిజార్డర్‌తో తీవ్రంగా ఇబ్బంది పడ్డానని తెలిపారు. ఈ కారణంగా ఏకంగా ఏడేళ్ల పాటు ఇంటికే పరిమితమై, పూర్తి ఏకాంత జీవితం గడిపినట్లు చెప్పారు. షారుఖ్ ఖాన్‌తో కలిసి అంతర్జాతీయ పర్యటనలో ఉన్నప్పుడు, ముంబైలో ఓ మ్యూజిక్ రియాలిటీ షో చేస్తున్న సమయంలో తనలో ఈ లక్షణాలు మొదలయ్యాయని హనీ సింగ్ వివరించారు. స్టేజ్‌పైనే చనిపోతానేమోనన్న తీవ్రమైన భయం, ఆందోళన తనను వెంటాడేవన్నారు. ఒకానొక దశలో చికాగోలో ప్రదర్శన ఇవ్వకుండా ఉండేందుకు తన తలను సగం షేవ్ చేసుకున్నానని, మరో షోలో రెండు పాటలు పాడి మధ్యలోనే వదిలేశానని గుర్తుచేసుకున్నారు. తరువాత ఏడేళ్ల పాటు అభిమానులకు, స్నేహితులకు దూరంగా ఇంట్లోనే ఉండిపోయానని చెప్పారు. ఫోన్, టీవీ, ఇంటర్‌నెట్ వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉన్నానన్నారు. సుమారు మూడేళ్ల పాటు తన గది దాటి బయటకు రాలేదని, మరణ భయంతో బాత్రూమ్ తలుపు కూడా తెరిచే ఉంచుకునేవాడినని తెలిపారు. 2018-19 సమయంలో తాను అప్పటికే చనిపోయానని, స్వర్గానికి, నరకానికి మధ్య చిక్కుకుపోయానని భ్రమపడ్డానని చెప్పి ఆశ్చర్యపరిచారు. ఏడేళ్ల పాటు వాడిన మందుల కారణంగా తన శరీర బరువు 105 కిలోలకు పెరిగిందని, జుట్టు పూర్తిగా ఊడిపోయి బట్టతల వచ్చిందని హనీ సింగ్ వెల్లడించారు. "ఇది నకిలీ జుట్టు, నాకు పూర్తిగా బట్టతల ఉంది. ఇది విగ్గు" అని ఇంటర్వ్యూలోనే ఓపెన్‌గా చూపించారు. డాక్టర్‌ను మార్చాక, కొత్త మందులు మొదలుపెట్టిన నాలుగు వారాల్లోనే మార్పు కనిపించిందని, అదే తన పునరాగమనానికి సహాయపడిందని అన్నారు. ఈ అనుభవం తనకు 30 ఏళ్ల వయసులోనే ఎదురవ్వడం మంచిదైందని భావిస్తున్నట్లు హనీ సింగ్ పేర్కొన్నారు.


## తెలుగు చిత్రపరిశ్రమ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉంది:

# దిల్ రాజు ఆసక్తికర వ్యాఖ్య



ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమ చాలా బ్యాడ్ షేప్‌లో ఉందనే మాట చెప్పడానికి తాను భయపడనని వ్యాఖ్యానించారు. ఈ మాట చెప్పడానికి చాలామంది భయపడతారని అన్నారు. కానీ తాను ధైర్యంగా చెప్పగలనని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించడం పెద్ద సవాల్ అన్నారు. 'సమ్మర్ హాలీడేస్' వంటి చిత్రాలను తీయడం ద్వారా ప్రేక్షకులను థియేటర్‌కు తీసుకురావాలని వ్యాఖ్యానించారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే మంచి సినిమాలు నిలబడతాయని అన్నారు. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్త దర్శకులంతా మంచి చిత్రాలను తీసి పరిశ్రమను నిలబెట్టాలని అన్నారు. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే పరిశ్రమ అంత బాగుంటుందని అన్నారు. ఈ చిత్రం ఈవెంట్ చాలా బాగా నిర్వహించారని, ఇందుకు నిర్మాతలను అభినందిస్తున్నానని అన్నారు. ఇటీవలి కాలంలో థియేటర్‌లలో సందడి కనిపించడం లేదని, ఈ చిత్రం ద్వారా థియేటర్‌లో సందడి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు.

# ఏ ప్రాంతానికి వెళ్లినా స్థానిక భాషలో మాట్లాడటానికే ప్రయత్నిస్తా: శ్రీలీల



టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయం లోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్ తో పాటు ఇతర పరిశ్రమల్లో నూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'డి-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.


# రామ్ చరణ్ కష్టం చూడకుండా విమర్శలా?.. ట్రోలింగ్ పై జగపతి బాబు ఫైర్!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల నడుమ జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో చిత్ర బృందం చురుగ్గా పాల్గొంటోంది. ఈ క్రమంలో రామ్ చరణ్ ప్రవర్తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ పై సీనియర్ నటుడు జగపతి బాబు తీవ్రంగా స్పందించారు. పనిలేని వాళ్లే ఇలాంటి విమర్శలు చేస్తుంటారని, హీరోల కష్టాన్ని గుర్తించాలని ఆయన హితవు పలికారు. 'పెద్ది' సినిమా ప్రమోషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న రామ్ చరణ్, కొన్ని ఈవెంట్లలో కొందరి పేర్లు మర్చిపోవడం, బెంగళూరులో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై సోషల్ మీడియాలో కొందరు ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ విమర్శలపై తాజాగా మీడియాతో మాట్లాడిన జగపతి బాబు, వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "ట్రోలింగ్ చేసే వాళ్లను నేను పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవరినైనా కిందికి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటివి చేస్తుంటారు. ఈ సినిమా కోసం చరణ్ ఎంత కష్టపడ్డాడో, ఎన్ని గాయాలపాలయ్యాడో ఎవరూ చూడరు. ఇలాంటి చిన్న విషయాలను పట్టుకుని పెద్దవిగా చేయడం సరికాదు" అని అన్నారు. ఒక పెద్ద సినిమా విడుదల సమయంలో హీరోలపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని కూడా ఆయన వివరించారు. "ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఒకేసారి ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం చాలా సహజం. నేను కూడా ఎన్నోసార్లు మర్చిపోతాను. వాటిని పట్టుకుని రాద్ధాంతం చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో తనపై కూడా ఇలాంటి ఫేక్ ప్రచారం జరిగిందని జగపతి బాబు గుర్తుచేసుకున్నారు. "ఒక సీన్ కోసం నేను 70-80 టేకులు తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అందులో ఎలాంటి వాస్తవం లేదు. నేను మహా అయితే మూడు టేకులు తీసుకుని ఉంటాను. పూర్తిగా అవాస్తవాలతో నాపై కూడా ట్రోలింగ్ చేశారు" అని తన అనుభవాన్ని పంచుకున్నారు. కాగా, స్పోర్ట్స్ డ్రామాగా రానున్న 'పెద్ది' చిత్రంలో జగపతి బాబు 'అప్పలసూరి' అనే కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. సినిమాపై అంచనాలు భారీగా ఉండటంతో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని మరింత పెంచింది.

# 'పుష్ప' అవకాశం నాకూ షాకే.. ఆ పాత్ర నా జీవితాన్నే మార్చేసింది: సునీల్

కమెడియన్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సునీల్, 'పుష్ప' చిత్రంలో మంగళం శ్రీను పాత్రకు ఎంపికవడం తనకూ ఓ షాక్ అని అన్నారు. ఈ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని, అన్ని భాషల్లోనూ అవకాశాలు తెచ్చిపెట్టిందని ఆయన తెలిపారు. తన తాజా మలయాళ చిత్రం 'కాటాలన్' తెలుగు వెర్షన్ ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సునీల్ ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'పుష్ప'లో విలన్‌గా సుకుమార్ మిమ్మల్ని ఎలా ఊహించుకున్నారని అడగ్గా.. "లాక్‌డౌన్ సమయంలో నేను కామెడీ పాత్రలు కాకుండా వేరేవి చేస్తున్నానని సుకుమార్‌కు చెప్పాను. రెండు రోజులకే ఆయన ఫోన్ చేసి 'పుష్ప'లో పూర్తిస్థాయి విలన్ పాత్ర ఉంది, కానీ కామెడీ చేయకూడదు, శరీరం కూడా కదపకుండా హావభావాలు పలికించాలని చెప్పారు," అని సునీల్ వివరించారు. లుక్ టెస్ట్ కోసం పంపిన కాస్ట్యూమ్స్‌తో రకరకాలుగా ఫోటోలు తీసి పంపించానని, అవి నచ్చడంతో ఆ పాత్రకు ఎంపికయ్యానని గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరిగినన్ని రోజులు పాత్ర కోసం నుదుటిపై షేవ్ చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. సునీల్ 'మారి' అనే కీలక పాత్రలో నటించిన 'కాటాలన్' చిత్రం మే 28న తెలుగులో విడుదల కానుంది. ఏనుగు దంతాల అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి పాల్ జార్జ్ దర్శకుడు. ఇందులో ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహాన్ సింగ్, దుషారా విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449